## కలెక్టరేట్ ఎదుట వీవోఏల ఆందోళన



కలెక్టరేట్‌ముందు ఆందోళన చేస్తున్న వీవోఏలు

నస్పూర్, నవంబర్ 11 : సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వీవోఏలు సోమవారం నస్పూర్‌లోని కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. ఐకేపీ వీవోఏల సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు రంజిత్‌కుమార్ మాట్లాడుతూ వీవోఏలకు గత ప్రభుత్వం ఇచ్చిన జీవో ప్రకారం సంఘం నుంచి రూ. 3 వేలు రావడం లేదన్నారు. సెర్ప్ నుంచి రూ. 5 వేలు, సెల్ఫ్ హెల్ప్ గ్రూపుల నుంచి రూ. 3 వేలు తీసుకోవాలని చెప్పారని, కానీ సంఘాలకు ఆదాయం లేక అమలు కావడం లేదన్నారు. ప్రభుత్వం వీవోఏలకు రూ. 20 వేల వేతనం ఇవ్వాలని, బకాయి ఉన్న స్త్రీనిధి ఇన్సెంటివ్ వెంటనే గ్రామ సంఘాలకు చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కుమార్, రాములు, పోశం, రజిత, అనిత, శారద, మహేశ్, వెంకటి, సమ్మన్న, తుకారాం, రాజ్యలక్ష్మి, భాగ్యలక్ష్మి, సురేష్, రమాదేవి పాల్గొన్నారు.

## బాబోయ్ పెద్దపులి

- కాసిపేట మండలంలో సంచరిస్తున్న టైగర్
- భయాందోళనలో ప్రజలు

చింతగూడ శివారులో పులి పాద ముద్రలు



కాసిపేట, నవంబర్ 11 : మండలం గురువాపూర్, పెద్ద ధర్మారం, చింతగూడ గ్రామ శివార్లలో పెద్దపులి సంచరిస్తుండగా, ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. సోమవారం దేవాపూర్ సల్పాలవాగు వైపునకు వచ్చినట్లు తెలిసింది. ఆపై మద్దిమాడ అటవీ శివారు వైపు వెళ్లిందా.. లేక ధర్మారావుపేట శివారు ప్రాంతానికి వెళ్లిందా అనేది తెలియాల్సి ఉంది. ఇప్పటికే గురువాపూర్ శివారులో, దేవాపూర్ మద్దిమాడ శివారులో పశువులపై దాడి చేసి చంపిన విషయం విదితమే. పెద్దపులి సంచారంతో అటవీ అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటున్నారు. పల్లెల్లో అవగాహన కల్పిస్తున్నారు. కాగా, రెండేళ్లుగా గురువాపూర్ శివారు అటవీ ప్రాంతంలో చిరుత పులి సంచరిస్తుండగా, 15 రోజులుగా పెద్దపులి ఆవాసం కోసం ప్రయత్నం చేస్తున్నట్లు పలువురు అధికారులు చెబుతున్నారు.

# ‘టచ్’ నిర్వాహకులు కలెక్టరేట్ ఎందుకెళ్లినట్లు?!

**‘మూడు ఆపరేషన్ల’ కేసు నుంచి బయటపడేందుకు తీవ్ర ప్రయత్నాలు!**

- డీఎంహెచ్‌వోను కలిసేందుకు యత్నం.. ఆయన నిరాకరించినట్లు సమాచారం
- హాస్పిటల్‌లో కొనసాగుతున్న విచారణ
- కలెక్టర్ ఆదేశాల మేరకు షోకాజ్ నోటీసులు



టచ్ హాస్పిటల్‌లో చికిత్స పొందున్న శివిని ఆమని (ఫైల్)

మంచిర్యాల అర్బన్, నవంబర్ 11 : బెల్లంపల్లికి చెందిన శివిని ఆమని గత నెల 15న జిల్లా కేంద్రంలోని టచ్ హాస్పిటల్‌లో చేరగా, వైద్యులు మూడు ఆపరేషన్లు చేయడం వల్ల ప్రాణాపాయ స్థితికి వెళ్లిన విషయం విదితమే. ప్రస్తుతం ఆమె దవాఖానలో తల్లడిల్లుతుండగా, న్యాయం చేయాల్సిన నిర్వాహకులు మాత్రం ఈ కేసు నుంచి బయటపడేందుకు తీవ్ర ప్రయత్నాలు మొదలు పెట్టినట్లు తెలుస్తున్నది. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణిలో టచ్ హాస్పిటల్ నిర్వాహకులు కనిపించడం ఇందుకు బలం చేకూరుస్తున్నది. డీఎంహెచ్‌వోను కలవడానికి వారు ప్రయత్నించగా ఆయన నిరాకరించినట్లు సమాచారం. దీంతో వారు అక్కడి నుంచి బయటకు వచ్చి ఇతర అధికారులను కలిసినట్లు తెలిసింది. ఎలాగైనా అధికారులను ప్రసన్నం చేసుకొని ఈ కేసు నుంచి బయటపడాలని తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. విచారణ కొనసాగుతున్న సమయంలో డీఎంహెచ్‌వో పిలవకపోయినా టచ్ హాస్పిటల్ నిర్వాహకులు కలెక్టరేట్‌కు వెళ్లడం వెనుక ఆంతర్యమేమిటని బాధిత కుటుంబ సభ్యులు ప్రశ్నిస్తున్నారు. కలెక్టరేట్‌లోని సీసీటీవీ ఫుటేజీలను పరిశీలిస్తే అసలు విషయం తెలుస్తుందని వారు పేర్కొంటున్నారు.

### కొనసాగుతున్న విచారణ..

బెల్లంపల్లికి చెందిన శివిని ఆమనికి మూడు ఆపరేషన్లు చేయడంపై విచారణ కొనసాగుతున్నది. ఈ నెల 8న ‘నమస్తే తెలంగాణ’లో ‘నెలలో మహిళకు మూడు ఆపరేషన్లు’ శీర్షికన కథనం ప్రచురితమవ్వగా, జిల్లా వైద్యాధికారి హరీశ్‌రాజ్ స్పందించి ప్రత్యేక వైద్య బృందాన్ని ఏర్పాటు చేసి విచారణకు ఆదేశాలు జారీ చేసిన విషయం విదితమే. ఈ మేరకు శుక్రవారం వైద్య బృందం సభ్యులు డా.శివప్రసాద్, డా.అశోక్, మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్లు టచ్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న బాధితురాలిని కలిసి వివరాలు సేకరించారు. అనంతరం ఆమె రికార్డులను దాదాపు మూడు గంటల పాటు పరిశీలించారు. ముఖ్యమైన సమాచారాన్ని సేకరించారు. విచారణ సమయంలో అధికారులు హాస్పిటల్ యాజమాన్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా ఆదివారం మరో ప్రత్యేక బృందం టచ్ హాస్పిటల్‌కు వెళ్లి మరిన్ని వివరాలు సేకరించినట్లు విశ్వసనీయ సమాచారం. సోమవారం మధ్యాహ్నం మంచిర్యాల జిల్లా వైద్యాధికారి డాక్టర్ హరీశ్‌రాజ్ కూడా నేరుగా హాస్పిటల్‌కు వెళ్లినట్లు తెలిసింది. ఈ విషయమై ఆయనతో మాట్లాడగా.. విచారణ కొనసాగుతుందని, త్వరలో పూర్తి వివరాలు వెల్లడిస్తామని తెలిపారు.

### షోకాజ్ నోటీసులు

కలెక్టర్ ఆదేశాల మేరకు టచ్ హాస్పిటల్ నిర్వాహకులకు షోకాజ్ నోటీసులు ఇచ్చారు. త్వరలో హైదరాబాద్ గాంధీ హాస్పిటల్ నుంచి స్పెషలిస్టులను పిలిపించి ఈ కేసుపై విచారణ చేయాలని కలెక్టర్ ఆదేశించినట్లు డీఎంహెచ్‌వో కార్యాలయ సిబ్బంది తెలిపింది.



వరి పంటను కోస్తున్న హార్వెస్టర్



పత్తిని సేకరించి తీసుకెళ్తున్న కూలీలు

# పంటలు కొంటలే!

- జిల్లాలో ప్రారంభంకాని పత్తి, ధాన్యం కొనుగోళ్లు
- దళారుల పాలవుతున్న తెల్లబంగారం
- తీవ్రంగా నష్టపోతున్న కర్షకులు
- వడ్లు ఆరబెట్టుకొని ఎదురుచూస్తున్న అన్నదాతలు



పత్తిని ఎడ్లబండిలో నింపిన కూలీలు

కుమ్రం భీం ఆసిఫాబాద్, నవంబర్ 11 (నమస్తే తెలంగాణ) : ఆరుగాలం శ్రమించి పండించిన పంటలను అమ్ముకునేందుకు అన్నదాతలు అష్టకష్టాలు పడాల్సి వస్తున్నది. వరి ధాన్యం, పత్తి చేతికొస్తున్న సమయంలో సర్కారు కొనుగోళ్లు చేపట్టకపోవడంతో నిరీక్షించాల్సిన దుస్థితి దాపురించింది. కొందరు తప్పనిసరి పరిస్థితుల్లో దళారులకు అమ్ముకుంటుండగా, వారు ఇదే అదనుగా భావించి అందినకాడికి దండుకోవడం పరిపాటిగా మారింది.

### తెల్లబంగారం దళారుల పాలు

జిల్లాలో ఈ ఏడాది 3.30 లక్షల ఎకరాల్లో పత్తి సాగైనట్లు తెలుస్తుండగా, 23 లక్షల క్వింటాళ్ల దిగుబడి వస్తుందని యంత్రాంగం అంచనా వేస్తున్నది. ప్రస్తుతం పత్తి తీత మొదలైంది. జిల్లాలోని ఆసిఫాబాద్, జైనూర్, కాగజ్‌నగర్‌లలో 17 జిన్నింగ్ మిల్లులు ఉండగా, ఒక్క ఆసిఫాబాద్‌లోని జిన్నింగ్ మిల్లులో తప్ప ఎక్కడా కొనుగోళ్లు ప్రారంభించలేదు. పత్తి కొనుగోళ్లు చేస్తామని మార్కెటింగ్‌శాఖ అధికారులు ప్రకటించి పది రోజులు గడుస్తున్నప్పటికీ ఫలితం లేకుండా పోయింది. సీసీఐ కొనుగోళ్లు ఆలస్యమవుతుండగా, ఇక ఇదే అదనుగా భావించిన దళారులు పల్లెల్లో దుకాణాలు తెరచి సేకరణ మొదలు పెట్టారు. రైతులు కూడా తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయిస్తుండగా, దీనిని అవకాశంగా భావించి తక్కువ ధరకు కొనుగోళ్లు చేపడుతూ నిలువు దోపిడీ చేస్తున్నారు. ప్రభుత్వం క్వింటాలుకు రూ. 7521 ధర నిర్ణయించగా, దళారులు మాత్రం రూ. 6 వేల నుంచి రూ. 6500 వరకే చెల్లిస్తున్నారు. దీంతో రైతులు రూ. వెయ్యి నుంచి రూ. 1500 వరకు నష్టపోతున్నారు. ఇటు దిగుబడులు సరిగా రాక.. అటు మద్దతు ధర లభించక అన్నదాతలు తీవ్రంగా నష్టపోతున్నారు.

### ధాన్యం సేకరణ ఎప్పుడో..

జిల్లాలో 59,212 ఎకరాల్లో వరి సాగయ్యింది. సుమారు 57 వేల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ ఏడాది 34 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకున్నప్పటికీ ఇప్పటి వరకు ఏ ఒక్కచోట కూడా కొనుగోళ్లు ప్రారంభించలేదు. పలుమార్లు సమీక్షలు నిర్వహించినప్పటికీ ఫలితం లేకుండా పోతున్నది. రైతులు ధాన్యాన్ని తీసు కొస్తూ ఇండ్లు, కొనుగోలు కేంద్రాల్లో ఆరబెట్టుకొని ఎదురుచూస్తున్నారు. ఒకవేళ వర్షం వస్తే తమ పరిస్థితి ఏమిటని ఆందోళన చెందుతున్నారు. ఇక ఇక సన్న రకం వరిధాన్యానికి ప్రభుత్వం ఇచ్చే రూ. 500 బోనస్‌పై రైతుల్లో సందేహం మొదలైంది. ఈ అంశంపై ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో బోనస్ ఇస్తారా.. లేదా అన్నది ప్రశ్నార్థకంగా మారింది. అసలు ఇంతవరకు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయని అధికారులు.. ఇక సన్నవడ్ల సేకరణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటారా.. అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇక ఏ-గ్రేడ్ రకానికి క్వింటాలుకు రూ. 2,320, సాధారణ రకానికి 2,300 మద్దతు ధరను ప్రభుత్వం నిర్ణయించినప్పటికీ కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో అలసత్వం కారణంగా రైతులు ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయించాల్సిన పరిస్థితి దాపురిస్తున్నది.

## నేడే మహాపాదయాత్ర

సిర్పూర్(టీ), నవంబర్ 11 : నేడు నిర్వహించనున్న టోంకిని లోని సిద్ధి హనుమాన్ ఆలయ మహాపాదయాత్రకు సోమవారం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ కమిటీ తెలిపింది. కాగజ్ నగర్ పట్టణంలోని హనుమాన్ దేవస్థానం నుంచి టోంకిని హనుమాన్ ఆలయం వరకు మంగళవారం భక్తులు మహాపాదయాత్ర చేపట్టనున్నారు.

# అంతా మా ఇష్టం!

**మంచిర్యాలలో నిబంధనలు పట్టించుకోని మున్సిపల్ అధికారులు**

- టెండర్లు పిలవకుండానే మార్కెట్ రోడ్డులో ఇష్టారాజ్యంగా తవ్వకాలు
- వివరణ కోరేందుకు సంప్రదిస్తే స్పందించని సిబ్బంది
- అసలు ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి
- కల్లుండీ చూడలేకపోతున్నారనే విమర్శలు



మంచిర్యాలలోని మార్కెట్‌రోడ్‌లో తవ్విన కాలువ

మంచిర్యాల టౌన్, నవంబర్ 11 : మంచిర్యాల పట్టణంలో అభివృద్ధి పేరిట యంత్రాంగం ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నది. నిబంధనలు తుంగలో తొక్కి.. టెండర్లు పిలవకుండానే పనులు చేపట్టడం విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మొన్నటికి మొన్న ఐబీ చౌరస్తాలోని ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను టెండర్లు పిలవకుండానే కొబ్బరికాయలు కొట్టిమరీ కూల్చివేశారు. రూల్స్‌కు విరుద్ధంగా వ్యవహరించారంటూ ఎవరెన్ని విమర్శలు చేసినా అధికారులు కనీసం ఆ వైపు కన్నెత్తి కూడా చూడలేదు. తాజాగా.. మార్కెట్‌రోడ్ వెడల్పు పేరిట ఇష్టారాజ్యంగా తవ్వకాలు చేపడుతున్నారు. ఎవరేమనుకున్నా ఈ రోడ్‌ను వెడల్పు చేసి తీరుతామని, సెట్‌బ్యాక్ లేకుండా నిర్మించిన భవనాలను తొలగిస్తామని ఎమ్మెల్యే పీఎస్సార్ స్పష్టం చేశారు. దసరా పండుగ సమయంలో రోడ్డుకు ఇరువైపులా మార్కింగ్ చేయగా, జేసీబీలు కొంత మేర నిర్మాణాలను కూల్చివేశాయి. పండుగల సమయం కావడంతో వ్యాపారస్తుల కోసం కాస్త విరామం ఇచ్చారు. దీపావళిలోగా సెట్ బ్యాక్‌లను తొలగించుకోవాలని షాప్‌లయాజమానులకే అవకాశం ఇచ్చారు.

### టెండర్లు పిలవకుండానే..

తాజాగా.. అర్చన టెక్స్ చౌరస్తా నుంచి మార్కెట్ వైపు జేసీబీతో రోడ్డుకు ఇరువైపులా తవ్వకాలు చేపడుతున్నారు. పెద్ద పెద్ద కాలువలు తీస్తున్నారు. నిబంధనలు పాటించకుండా.. టెండర్లు పిలవకుండానే తవ్వుతున్నట్లు సమాచారం. గవర్నమెంట్ ఏ పని చేయాలన్నా నిధులు కేటాయించి, టెండర్లు పిలిచాక గానీ తట్టెడు మట్టి తీయరు. అలాంటిది ఎలాంటి టెండర్ లేకుండా ఈ పనులు ఎలా చేస్తున్నారన్నది ప్రశ్నార్థకంగా మారింది. అసలు టెండర్లు ఎప్పుడు పిలిచారు.. టెండర్ ఎవరు దక్కించుకున్నారు.. అంటే మున్సిపల్ అధికారుల నుంచి సమాధానం చెప్పే నాథుడే కరువయ్యాడు. కాలువ కోసం తీసిన మట్టిని టిప్పర్ లారీలతో ఎక్కడికో తరలించుకుపోతున్నారు. అంటే అనధికారికంగా ఎవరికో కాంట్రాక్ట్ అప్పగించారని అర్థమవుతున్నది. అసలు ఈ కాలువ ఎందుకు తవ్వుతున్నారు, ఇక్కడ ఏం నిర్మిస్తారు.. అన్న విషయాలు రహస్యంగా ఉంటున్నాయి. ఒకవేళ డ్రైనేజీ నిర్మించాలనుకుంటే ఆక్రమణలు తొలగించిన మార్కెట్ రోడ్డు పొడవునా నిర్మించాలి. కానీ ఈ కాలువ కేవలం అంజలి డ్రెస్సెస్ దగ్గర నుంచి అర్చనటెక్స్, సింధూరి సిల్క్స్, దాని పక్కన ఉన్న భవనం వరకు తీసి, అక్కడి నుంచి పశ్చిమం వైపునకు మళ్లించారు. ఈ విషయమై స్పష్టత కోసం ‘నమస్తే తెలంగాణ’ మున్సిపల్ చైర్మన్ ఉప్పలయ్య, కమిషనర్ మారుతీ ప్రసాద్, ఎంఈ మసూద్‌లను సంప్రదించగా స్పందించ లేదు. ‘ప్రజా పాలన’లో నిబంధనలు తుంగలో తొక్కి ఇష్టారాజ్యంగా తవ్వకాలు చేపడుతుంటే కల్లుండీ చూడలేకపోతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మరి ఈ విషయంలోనైనా జిల్లా అధికారులు జోక్యం చేసుకుంటారా లేక చూసిచూడనట్లు మిన్నకుండిపోతారా వేచి చూడాల్సి ఉన్నది.

## పట్టుదలతో చదవాలి

కాగజ్‌నగర్, నవంబర్ 11: విద్యార్థి దశ నుంచి పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ గమనీయల్ అన్నారు. సోమవారం మండలంలోని బలగల మైనార్టీ గురుకుల విద్యాలయం బాయ్స్-2లో మైనార్టీ వెల్ఫేర్ డే ఘనంగా నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ విద్యతోనే జీవితంలో ఎదుగుదల సాధ్యమన్నారు. సిబ్బంది ఏడీను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జి రావీ శ్రీనివాస్, ప్రిన్సిపాల్ ఫిర్దోస్ పాల్గొన్నారు.

## గ్రూప్-3 పరీక్షకు సర్వం సిద్ధం

నస్పూర్, నవంబరు 11 : జిల్లాలో ఈ నెల 17,18 తేదీల్లో నిర్వహించనున్న గ్రూప్-3 పరీక్షకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ కుమార్ దీపక్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 17న ఉదయం, మధ్యాహ్నం, 18న ఉదయం పరీక్ష నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. 48 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, 15,038 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కానున్నారని తెలిపారు. నోడల్ అధికారిగా జిల్లా అదనపు కలెక్టర్ మోతీలాల్, పోలీసు నోడల్ అధికారిగా సుందర్, బెల్లంపల్లి ఏఆర్ ఏసీపీ, ప్రాంతీయ సమన్వయకర్తగా నరేందర్‌రెడ్డి నియమించినట్లు తెలిపారు. ఉదయం 8.30 గంటలకు, మధ్యాహ్నం 2 గంటలకు పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని పేర్కొన్నారు.



పోస్టర్ విడుదల చేస్తున్న రామగుండం సీపీ శ్రీనివాస్, అధికారులు

# పోలీసులున్నది ప్రజల రక్షణకే

**రామగుండం సీపీ శ్రీనివాస్**

మంచిర్యాల అర్బన్, నవంబర్ 11 : ప్రజలకు సమస్య వస్తే వెంటనే తమను సంప్రదించాలని, పోలీసులున్నది ప్రజల రక్షణకేనని గుర్తుంచుకోవాలని సీపీ శ్రీనివాస్ అన్నారు. సోమవారం రామగుండం కమిషనరేట్ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర షీ టీమ్ ఉమెన్ సేఫ్టీవింగ్ ఆధ్వర్యంలో పోస్టర్లను విడుదల చేశారు. సీపీ మాట్లాడుతూ ఎవరైనా ఆన్‌లైన్ యాప్స్, సామాజిక మాధ్యమాల ద్వారా వేధింపులు, లైంగిక వేధింపులకు గురి చేసినా, వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలిగించినా వెంటనే డయల్ 100కు లేదా షీ టీమ్స్ వాట్సప్ నంబర్ 6303923700లో సంప్రదించాలన్నారు. తల్లిదండ్రులు రోజూ పిల్లలకు కాసేపు సమయం కేటాయించాలని, వారికి గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్ర రావు, మంచిర్యాల జోన్ సిటీ ఇన్‌చార్జి ఎస్ఐ హైమ, మంచిర్యాల షీ టీమ్ సిబ్బంది పాల్గొన్నారు.

## సమస్యలు సత్వరమే పరిష్కరించాలి

**- కలెక్టర్లు కుమార్ దీపక్, వెంకటేశ్ ధోత్రే**

నస్పూర్, నవంబర్ 11 : ప్రజావాణిలో వివిధ సమస్యలపై వచ్చే దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం నస్పూర్ కలెక్టరేట్‌లో మంచిర్యాల, బెల్లంపల్లి ఆర్డీవోలు శ్రీనివాసరావు, హరికృష్ణతో కలిసి అర్జీదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు.

### ఆసిఫాబాద్‌లో..

ఆసిఫాబాద్ టౌన్, నవంబర్ 11 : ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులపై తక్షణమే స్పందించాలని కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, ఆసిఫాబాద్ ఆర్డీవో లోకేశ్వర్‌రావుతో కలిసి అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు.



ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న నిర్వాహకులు

## ముగిసిన జోనల్ స్థాయి వాలీబాల్ పోటీలు

దండేపల్లి, నవంబర్11 : మండలంలోని తాళ్లపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్)ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్-14 జోనల్ స్థాయి వాలీబాల్ పోటీలు సోమవారం ముగిశాయి. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్)కన్వీనర్ ఫణిరాజా మాట్లాడుతూ క్రీడల్లో గెలుపోటములు సహజమని, ప్రతి ఒక్కరూ క్రీడాస్ఫూర్తితో ముందుకెళ్లాలని సూచించారు. మంచిర్యాల, నిర్మల్, ఆదిలాబాద్, కుమ్రం భీం ఆసిఫాబాద్ జట్లు ఇందులో పాల్గొన్నాయి. ఆదిలాబాద్ జట్టు ప్రథమ స్థానంలో నిలవగా, మంచిర్యాల జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. 12 మంది రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ ఆకుల రాజేందర్, మాజీ ఉప సర్పంచ్ పుట్టపాక తిరుపతి, టోర్నమెంట్ కన్వీనర్ సిరంగి సుదర్శన్, పీడీ రోజి వరకుమారి, వాలీబాల్ శిక్షకులు బోడకుంట మహేశ్, అఫ్రోజ్, రాజు, నాయకులు లచ్చుపటేల్, దయాకర్, కంది రవి, ఇమ్రాన్, మహేశ్, ఉపాధ్యాయులు, తదితరులు ఉన్నారు.

# సర్‌సిల్క్ భూములపై అధికారులకు కోర్టు ధిక్కరణ నోటీసులు

కుమ్రం భీం ఆసిఫాబాద్, నవంబర్ 11 (నమస్తే తెలంగాణ): కాగజ్‌నగర్‌లోని సర్‌సిల్క్ భూములను వేలం పాటలో కొనుగోలు చేసిన వ్యక్తికి భూమిని అప్పగించాలనే కోర్టు ఆదేశాలను అమలు చేయని అధికారులకు కోర్టు ధిక్కరణ (కంటెంప్ట్ ఆఫ్ ది కోర్టు) నోటీసులను సోమవారం హైకోర్టు జారీ చేసింది. సర్‌సిల్క్ భూముల విక్రయానికి 2009లో నిర్వహించిన వేలంపాటలో వరంగల్‌కు చెందిన వెంకట నారాయణరావు(ఎంస్ బాలాజీ కంపెనీ) 186 ఎకరాలను కొనుగోలు చేశారు. అధికారులు 2011లో ల్యాండ్ కన్‌ఫర్మేషన్ ఇచ్చారు. భూములను కొనుగోలు చేసిన వెంకట నారాయణకు 2016లో అధికారులు 156 ఎకరాలను మాత్రమే రిజిస్ట్రేషన్ చేశారు. కానీ.. ల్యాండ్‌ను సర్వేచేసి అప్పగించలేదు. మిగతా 25 ఎకరాలు కబ్జాల్లో ఉండడంతో అధికారులు రిజిస్ట్రేషన్ చేయలేదు. వేలం పాటలో కొనుగోలు చేసిన ల్యాండ్ మొత్తం ఫిజికల్‌గా చూపించి తనకు అప్పగించాలని కొనుగోలుదారుడైన వెంకట నారాయణ అధికారులను కోరినప్పటికీ పట్టించుకోలేదు. దీంతో 2017లో సదరు భూమి కొనుగోలు చేసిన వ్యక్తి కోర్టును ఆశ్రయించారు. దీంతో ల్యాండ్‌ను సర్వేచేసి కొనుగోలు దారుడికి అప్పగించాలని కోర్టు ఆదేశాలు జారీ చేసింది. కానీ.. అధికారులు అప్పగించలేదు. దీంతో కొనుగోలు దారుడు మళ్లీ కోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ చేపట్టిన కోర్టు సోమవారం అప్పటి కలెక్టర్లు రాజీవ్‌గాంధీ హన్మంతు, చంపాలాల్, అప్పటి తహసీల్దార్లు కాంపల్లి వనజారెడ్డి, కదం సురేశ్, కమిషనర్ సర్వే సెటిల్‌మెంట్ ల్యాండ్ రికార్డు శశిధర్, కరికాల వలవేన్, సర్‌సిల్క్ లిక్విడేటర్స్ పోల రఘునాథ్, అరవింద్ శుక్లాకు కోర్టు ధిక్కరణ నోటీసులను జారీ చేసింది. ఈ నెల 25న న్యాయ స్థానంలో హాజరుకావాలని ఆదేశించింది.



వజ్ర రెసిడెన్సీని ప్రారంభిస్తున్న నిర్వాహకులు

## ఘనంగా వజ్ర రెసిడెన్సీ ప్రారంభం

మంచిర్యాల అర్బన్, నవంబర్ 11 : మంచిర్యాల జిల్లా కేంద్రంలోని సాయిబాబునగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన వజ్ర రెసిడెన్సీని నిర్వాహకులు బోరిగం శ్రీనివాస్, బియ్యాల శ్రీనివాస్, అంగల శ్రీనివాస్, రాజ్‌కుమార్ రేన్వా సోమవారం ఘనంగా రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. నిర్వాహకులు మాట్లాడుతూ మంచిర్యాల, చుట్టు పక్క ప్రాంతాల నుంచి వచ్చే వారికి ఇక్కడ హైదరాబాద్ తరహాలో సేవలు అందించనున్నట్లు పేర్కొన్నారు. విశాలమైన గదులు, ఏసీలు, అద్భుతమైన బంక్వెట్ హాల్‌లాంటి సదుపాయాలను కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ పుర ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, బంధువులు, స్నేహితులు పాల్గొన్నారు.